మూవీమ్యాక్స్ - మౌలాలి 9.10,12.40,4.10,7.45,11.15
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.15,1.20,4.30,7.40,10.40
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 1.20,10.45

GLOBAL CINEMAS RELEASE

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6: కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 2కిలోల 94 గ్రాముల నిషేధిత గంజాయిని పట్టుకున్నామని మూడో రాణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. కార్ఖానగడ్డ వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలో పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు ఒక వ్యక్తి అనుమానాస్పదంగా వ్యవహరిస్తూ పారిపోయేందుకు ప్రయత్నించగా అతన్ని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకు న్నారు. అనంతరం అతని, బైక్‌లో తనిఖీ చేయగా నిషేధిత గంజాయి పట్టుబడింది. నిందితుడు నిజామాబాద్ ముజాహిద్ నగర్‌కు చెందిన ఎండీ ఉస్మాన్(33) గంజాయి విక్రయిస్తుంటాడని విచారణలో వెల్లడైనట్లుగా సీఐ తెలిపారు. నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు బైక్‌పై వచ్చి ఇక్కడే ఒక వ్యక్తికి గంజాయిని విక్రయించేందుకు రాగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించా డని తెలిపారు. నిందితుడి వద్ద లభించిన గంజాయితోపాటు బైక్, సెల్‌ఫోన్‌ల ను సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

130 క్వింటాళ్ల రేషన్ బియ్యం..

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6: కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం చొప్పదండి మండలం ఆర్నకొండ వద్ద ఒక డీసీఎం వ్యాన్‌ను తనిఖీ చేయగా 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ప్రభుత్వం ఉచితంగా పేదలకు పంపిణీ చేసిన పీడీఎస్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేసిన కొందరు దుబ్బపల్లి నుంచి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుబడిందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపారు. డీసీఎం వ్యాన్‌లో 130 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యంను తరలిస్తున్న కరీంనగర్ ఆటోనగర్‌కు చెందిన సిరిగిరి మోసెస్, మహారాష్ట్ర సిరివంచకు చెందిన విరన్, హన్మకొండ జిల్లా శాయంపేటకు చెందిన విజేందర్‌పై కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, సివిల్‌సప్లైస్ ఆఫీసర్ ఉష తదితరులు తెలిపారు.

బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు గుండెపోటు

● ఆస్పత్రికి తరలించిన కండక్టర్, ప్రయాణికులు ● చికిత్స పొందుతూ మృతి

హుజూరాబాద్/సైదాపూర్, అక్టోబరు 6: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఠాగూర్ రమేష్ సింగ్(46) విధులు నిర్వహిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన కండక్టర్, ప్రయాణికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఠాగూర్ రమేష్‌సింగ్ హుజూరాబాద్ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఆయన హుజూరాబాద్ డిపో నుంచి హైదరాబాద్‌కు బస్సు నడుపుకుంటూ వెళ్తుండగా, సిద్దిపేట జిల్లా గౌరారం స్టేజీ వద్దకు రాగానే గుండెలో నొప్పి వస్తుందని కండక్టర్, ప్రయాణికులతో తెలిపి బస్సును పక్కకు నిలిపివేశాడు. వెంటనే ప్రయాణికులు 108కు సమాచారం అందించి గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.




ఠాగూర్ రమేష్‌సింగ్(ఫైల్), లింగమూర్తి (ఫైల్)

రమేష్‌సింగ్ బస్సు నడుపుతున్న సమయంలో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారు.

● విధి నిర్వహణలో కండక్టర్ మృతి..

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన రాకం లింగమూర్తి (55) అనే కండక్టర్ విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. కరీంనగర్-2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చి తన విధులు నిర్వహిస్తున్న క్రమంలో గుండెపోటు వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అనేక సంవత్సరాలుగా సీపీఐ సానుభూతిపరుడిగా కొనసాగుతున్నాడు. అతన మృతిపై సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో లింగమూర్తి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ టీడీపీ నాయకులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

● విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతిచెందిన కండక్టర్ రాకం లింగమూర్తి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



కాట వెంకటేశ్ (ఫైల్)

మానకొండూర్, అక్టోబరు 6: మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన కాట వెంకటేశ్ (35) అనే యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన వెంకటేశ్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తండ్రి లేడనే బాధతో మద్యానికి బానిసై ఈ నెల 4న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు వెంకటేశ్ భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇల్లందకుంట, అక్టోబరు 6: మండలంలోని బూజునూర్ గ్రామచెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందినవారు బతుకమ్మ చెరువు సమీపం గుండా ఆదివారం వెళ్తుండగా చెరువులో మృతదేహం కనబడింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 35-45సంవత్సరాల వయస్సు ఉంటుంది. కుడి చేతికి స్టీల్ కడెం, చామన్‌చాయ రంగుతో పాటు బ్లూ కలర్ ఫుల్ టీషర్ట్ ఉంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినట్లయితే 8712670778 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి



నరేష్ (ఫైల్)

మానకొండూర్, అక్టోబరు 6: మండలంలోని కెల్లేడు గ్రామ శివారులో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన అసిస్టెంట్ లైన్‌మెన్ జోగు నరేష్ విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందాడు. కొండపల్కల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కెల్లేడు గ్రామ శివారులో 33బై11 కేవి విద్యుత్ లైన్ పనులను మరమ్మతు పనులు చేసేందుకు ఆదివారం విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ సరఫరా కొనసాగుతుండడంతో విద్యుదాఘాతంతో స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

- ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మయ్య (ఫైల్)

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 6: మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భార్యతో కలిసి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య(58) తన భార్యతో కలిసి ఆదివారం దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అందుగులపల్లి గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. లక్ష్మయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందగా, అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు లక్ష్మయ్య భార్య వేముల మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి




కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.


పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.


గోదావరిఖనిలో పూజలు చేస్తున్న మనాలీ ఠాకూర్


కనుకులలో దుర్గాదేవికి పూజలు..


పుట్నూర్‌లో అన్నదానంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక్ హరి

లలిత త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు..

- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు.. - పలుచోట్ల అన్నదానాలు

గోదావరిఖని, అక్టోబరు 6: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు లలిత త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అమ్మవారి ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దేవి దీక్ష తీసుకున్న భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ పలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్ష భక్తులకు సంహపక్తి భోజనం వడ్డించారు.

సుల్తానాబాద్ : దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కనుకుల గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అమ్మవారికి లలిత త్రిపుర సుందరి అవతారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుకుల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కొమ్మిడి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని పుట్నూర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక్ హరి దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, కల్లెపు బాలాజీరావు, మదన్ మోహన్‌రావు, కొండ నారాయణ, పడాల శ్రీధర్, బత్తిని సతీష్, పెద్దపల్లి నాగరాజు, కండె స్వామి తదితరులు పాల్గొన్నారు.


ఖనిలో లలిత త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు

కూష్మాండ అలంకారంలో అమ్మవారు


స్వామివారల ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, నాయకులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 6 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారు కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అశ్వయుజ శుద్ధ చవితి సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారలను నంది, గరత్మంతుడు వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సూపరింటెండెంట్‌లు తిరుపతిరావు, రాజేందర్, వెంకన్న పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం పార్వతిపరమేశ్వరులను దర్శించుకొని తరించారు. ఈవో వినోద్‌రెడ్డి ఆలయ పరిసరాలను తనిఖీ చేశారు. సౌకర్యాలు, ఇబ్బందులపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులతో ఉద్యోగులు, సిబ్బంది మర్యాదగా మెదలాలని సూచించారు.

నేటి నుంచి భవానీ దీక్షలు ప్రారంభం

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 2: దేవీశరన్నవరాత్రోత్సవాలలో భాగం గురువారం నుంచి భవానీ మాలదీక్షలు స్వీకరణ ప్రారంభమవుతుందని గోదావరిఖని భవాని యజ్ఞదీక్ష సమితి వ్యవస్థాపకులు కట్ట సురేష్‌భవాని ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు గురువారం నుంచి మాల దీక్షలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయండి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 6: తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, ఇతరత్రా సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ కార్యాలయంల ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేరుకే మండల కేంద్రం.. కనీస వసతులు శూన్యం

- ప్రజలకు తప్పని ఇబ్బందులు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకుర్తి, అక్టోబర్ 6 : పాలకుర్తి మండల కేంద్రం సమస్యలకు నిలయంగా మారింది. మండలాల పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పాటైన మండలం పాలకుర్తి. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, అధికార యంత్రాంగాన్ని ప్రజలకు చేరువలో ఉంచాలని, మౌలిక వసతుల కల్పనతో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2019 జూలై నెలలో అప్పటి ప్రభుత్వం నూతన మండలాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ఏర్పాటైన పాలకుర్తి మండలంలో ఐదేళ్లు కావస్తున్నా కనీస వసతులు కరువయ్యాయి. ఇన్నేళ్లయినా తమకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు విఫలమయ్యారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. తొలుత మండలాన్ని ఆఘమేఘాల మీద బసంత్‌నగర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయాన్ని పాలకుర్తిలోని పాఠశాల ఆవరణలో పెచ్చులూడుతున్న ఓ భవనంలో ప్రారంభించి అధికార యంత్రాంగం, పాలకులు చేతులు దులుపుకున్నారు. ఇప్పటికీ మండల కేంద్రంలోని ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి స్వంత భవనం లేకపోవడం, అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే కొనసాగుతుండడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


బసంత్‌నగర్ రాజీవ్ రహదారి

రవాణా సౌకర్యమూ కరువే..

మండల కేంద్రానికి ఇప్పటివరకు కనీసం ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గోదావరిఖని నుంచి పాలకుర్తి మీదుగా ఈసాలతక్కళ్లపల్లి వరకు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు, సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు విద్యార్థుల రాకపోకల కోసం గోదావరిఖని డిపో బస్సు నడిచేది. కానీ ఏడాదిన్నర నుంచి ఆ బస్సు రాకపోకలు సైతం నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి గోదావరిఖని లేదా పెద్దపల్లిలాంటి పట్టణాలకు వెళ్లాలంటే 5 కిలో మీటర్ల దూరంలోగల బసంత్‌నగర్ వరకు వెళ్లి, అక్కడి నుంచి బస్సుల ద్వారా ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులతో పాటు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు మండల కేంద్రంలో ఆటోల కోసం వేచిచూసే వారికి బస్టాండ్లు, ఆటో స్టాండ్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ లేదా చెట్ల కింద నిలబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల ఏర్పాటుతో పాటు కనీస మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పాలకుర్తి గ్రామం

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తా


ఫొటోగ్రాఫర్ల యూనియన్ నేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబరు 6: ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విజయ్, పూసాల రామక్రిష్ణతో పాటు శ్రీ వాణి విద్యాసంస్థల డైరెక్టర్లు రేకులపల్లి సుష్మా, శశాంక, కాంగ్రెస్ నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్య, సాయిరి మహేందర్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, చిలుక సతీష్, వేగోలం అబ్బయ్య గౌడ్, పాల్గొన్నారు.

'సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందంజ'

సుల్తానాబాద్, అక్టోబర్ 6: అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఆర్యవైశ్యులు సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ ట్రెజరర్ పొట్టి శ్రీనివాస్ అన్నారు. సుల్తానాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు శ్రీనివాస్ మాట్లాడుతు ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కలసి కట్టుగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కెసీజీఎఫ్ రీజయిన్ ఛైర్మన్ అల్లంకి లింగమూర్తి, పద్మావతి దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అంటగట్టారంటూ రైతుల ఆవేదన

సుల్తానాబాద్, అక్టోబర్ 6: నకిలీ విత్తనాలు అంటకట్టి తమను మోసం చేశారని మండలంలోని నారాయణరావుపల్లి, సాంబయ్యపల్లి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యశోద కంపెనీ ద్వారా వరి విత్తనాలు కొనుగోలు చేయగా ఎదుగుదల లేకుండా పోయిందని ఆరోపించారు. గ్రామానికి చెందిన చిగురి సతీష్‌రెడ్డి తదితరులు కంపెనీ వారిని పిలిపించి విషయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిదులు మాట్లాడుతూ పంటలను పరిశీలించి తగు న్యాయం చేస్తామన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో కేరళ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, అక్టోబర్ 6: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సుల్తానాబాద్ కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియోషన్ ఆధ్వర్యంలో రామగుండం ఎన్టీపీసీలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రచేతన్ 600 మీటర్లు, విగ్నేష్, సృజన లాంగ్ జంప్‌లో, గాయత్రి షాట్ పుట్‌లో, వైశాలి 600 మీటర్ల పరుగు పోటీలలో మంచి ప్రతిభను చాటుకున్నారని కరస్పాండెంట్ సిజ్జు ఎస్ నాయర్, ప్రిన్సిపాల్ స్మిత లు తెలిపారు. ఈ నెల 7న తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియోషన్ ఆధ్వర్యంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటున్నారని వివరించారు.

కాలబైరవ విగ్రహానికి ఇత్తడి తొడుగు

ఓదెల, అక్టోబరు 6 : భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో కాలభైరవ విగ్రహానికి ఆదివారం ఆలయ ధర్మకర్త చింతం మొగిలి ఇత్తడి తొడుగులను వితరణ చేసి విగ్రహానికి అమర్చారు. తన తల్లి చింతం ప్రమీల జ్ఞాపకార్థం సొంత ఖర్చుతో ఇత్తడి తొడుగులను తయారు చేసి అమర్చడం జరిగిందని ధర్మకర్త మొగిలి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మేకల మల్లేశం, ధర్మకర్తలు భత్తుల రమేష్, ఆరెల్లి మొండయ్య, దాసరి రాజయ్య ,కర్రె కుమార్, చింతం వెంకటస్వామి, కనికిరెడ్డి సతీష్, మూడేత్తుల శ్రీనివాస్, శ్రీకాంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కలం స్నేహం ఆధ్వర్యంలో బతుకమ్మ కవితోత్సవం


బతుకమ్మ కవితోత్సవంలో పాల్గొన్న కలం స్నేహితులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 6: కలం స్నేహం ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం పెద్దపల్లిలో కలం స్నేహం.. బతుకమ్మ కవితోత్సవం పేరిట నిర్వహించిన సమావేశంలో కలం స్నేహం సభ్యులంతా పాల్గొని బతుకమ్మ పండుగ గురించి బతుకమ్మ పాటల గురించి పూజల గురించి పూల గురించి కవితలు రాసి, పాటలు పాడి అందరినీ అలరించారు. కార్యక్రమంలో కలం స్నేహం వ్యవస్థాపకులు గోపాల ఆచార్య, హరిప్రియ, గీతశ్రీ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు సట్టు కనకయ్య, తహసిల్దార్ తూము రవీందర్, డీపీఓ వీర బుచ్చయ్య, పీజీ హెచ్ ఎం ఈర్ల శోభారాణి, కలం స్నేహం కార్యనిర్వాహక వర్గం అనాసి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 6: మండలంలోని ఎదులాపూర్ గ్రామం నుండి జాఫర్‌ఖాన్‌పేట వరకు గల ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొలిచిన చెట్లను శనివారం జేసీబీ, బ్లేడ్‌ట్రాక్టర్ సహాయంతో చెట్లను తొలగించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు ఈ పనులను చేసినట్లు మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ తెలిపారు. ఈ వర్షాకాల వరి పంట వచ్చే సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిచ్చి మొక్కలు తొలగించి మైదానం కూడా చదును చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యూనిఫామ్ సర్వీసెస్ అధికారుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న అధికారులు

జూలపల్లి, అక్టోబరు 6: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన యూనిఫామ్ సర్వీసెస్ మరియు పోలీసుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులో గల శ్రీయోగానందా లక్ష్మినర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఈకార్యక్రమానికి పలువురు మండలానికి చెందిన పోలీసు ఉన్నతాధికారులు హాజరై తమ మండల యూనిఫామ్ సర్వీసెస్ మరియు పోలీసులతో ఒకే వేదికపై కలుసుకుని ఎంతో ఆనందంగా సందడి చేశారు. మండలంలో మొత్తం 130 మంది ఉండగా సుమారు 60మంది ఆత్మీయ సమ్మేళనానికి హాజరై తమ మనోభావాలను పంచుకున్నారు. కష్టసుఖాల్లో తాము అందరం ఒకరికి ఒకరం అండగా నిలిచి ఆదుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలువాలని ఈసందర్భంగా వారు తీర్మానించారు. కార్యక్రమంలో సీఐ సురేష్, జైలర్ శ్రీనివాస్, సీఐ కిరన్‌రెడ్డి, పర్శరాంగౌడ్, మల్లికార్జున్, మొగురం అంజనేయులు, మొగురం శంకర్, కోరెపు శంకర్, గంగాధర్, కరికిరెడ్డి కుమార్, సురెందర్, రమేష్, కాజాపాషా, పలువురు పాల్గొన్నారు.



ఉత్కంఠ భరితంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్


విజేత జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబర్ 6: సింగరేణి ఆర్‌జీ-1 అధికారుల జట్టు, ఖని ప్రెస్‌క్లబ్ జట్టు మధ్య ఆదివారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ క్రికెట్ మ్యాచ్‌ను ఆర్‌జీ-1 జీఎం డి.లలిత్‌కుమార్ ప్రారంభించగా సింగరేణి ఆర్‌జీ-1 క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా 11 గ్రూప్ చిలక శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ జట్టుకు కెప్టెన్‌గా మల్లిక్ వ్యవహరించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో సింగరేణి ఆర్‌జీ-1 జట్టు విజయం సాధించింది. బహుమతి ప్రధానోత్సవానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హాజరై విజేత జట్టుకు బహుమతి అందజేశారు. ఫ్రెండ్లీ మ్యాచ్‌ల ద్వారా అధికారుల, విలేకరుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని, తద్వారా సమాజానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో ఇలాంటి స్నేహపూర్వక క్రీడలు రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కె.స్వామి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఎస్‌సీ వరప్రసాద్, సాయిప్రసాద్, క్రాంతికుమార్, సీనియర్ పీవోలు బంగారు సారంగపాణి, హనుమంతరావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేష్, కోఆర్డినేటర్ సంతోష్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లాభాల వాటాపై తప్పుడు ప్రచారం చేస్తున్న సంఘాలు

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిటౌన్, అక్టోబరు 6: కార్మికులకు 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండు రోజుల్లో చెల్లించనున్న లాభాల వాటాపై కొన్ని కార్మికసంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదని ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వాస్తవ లాభాన్ని, స్థూలలాభాన్ని వెల్లడించినా తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ వాస్తవలాభాలు వెల్లడించలేదని, ఇప్పటికైనా కార్మికసంఘాలు కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మాట్లాడితే మంచిదన్నారు.

గోదావరిఖనిలో బీఆర్‌ఎస్ దీక్ష భగ్నం

- వేదిక, టెంట్లు తొలగించిన పోలీసులు


టెంటును లాగేస్తున్న పోలీసులు


నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

గోదావరిఖని, అక్టోబరు 6: సింగరేణి నికర లాభాల్లో కార్మికులకు 33శాతం వాటా చెల్లించాలనే డిమాండ్‌తో ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో తలపెట్టిన బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ శిబిరాన్ని పోలీసులు తొలగించారు. దీక్షకు అనుమతి లేదని, అక్కడ వేసిన టెంట్లను, వేదికను పోలీసులు బలవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అరగంట పాటు రెండు వర్గాల మధ్య నినాదాలు, తోపులాటలుచోటు చసుకున్నాయి. దీంతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు, నడిపెల్లి దివాకర్, కోవ లక్ష్మి, టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి తమ అనుచర గణంతో శ్రేణులతో చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వీందరిని పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. నిరసన దీక్షకు వేసిన టెంట్లను, వేదికను పోలీసులు తొలగించడంతో ఇదే నిరసన దీక్షను పక్కనే టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయ ఆవరణలో కొనసాగించారు.

కార్మికులకు నికర లాభాల్లో 33శాతం ఇవ్వాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, అక్టోబరు 6: సింగరేణి కార్మికులకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన నికర లాభాలు రూ.4701కోట్లపై 33శాతం వాటా ఇవ్వాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా సమీపంలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయ ఆవరణలోని నిరసన దీక్షలో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వంపై మండిపడ్డారు. నికర లాభాల నుంచి రూ.2,289కోట్ల కోత విధించి కేవలం రూ.2412కోట్లపై మాత్రమే 33శాతం వాటా చెల్లించడం కార్మికులను దగా చేయడమేనని ఆయన అన్నారు. నిరక లాభాలపై 33శాతం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. రక్తాన్ని చెమటగా మార్చి లాభాలను ఆర్జించి పెడుతున్న కార్మికులను సింగరేణి సంస్థ, కాంగ్రెస్ ప్రభుత్వం వంచనకు గురి చేసిందని ఈశ్వర్ ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు. అలాగే సింగరేణి కార్మికులను కూడా లాభాల వాటా చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. స్వయంగా ఉప ముఖ్యమంత్రి ప్రకటించిన లాభాలను కూడా కోత విధిస్తూ, అందులో కార్మికుల వాటాను తగ్గించిందని ఆయన అన్నారు. పక్కకు పెట్టిన రూ.2200కోట్లను ఎందుకు పక్కన పెట్టారో కూడా స్పష్టంగా చెప్పడం లేదని ఈశ్వర్ పేర్కొన్నారు. తాము పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్షాలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా తాము ఎవరిని ఇబ్బందులు పెట్టలేదని, కార్మికులకు న్యాయం చేయాలని నిరసన దీక్ష చేపట్టేందుకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదని, అప్రజాస్వామికంగా, నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఈశ్వర్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఎక్కడ ప్రశ్నించినా పోలీస్ యంత్రాంగం అడ్డుకుంటున్నదని ఆయన అన్నారు. ఇప్పటికైనా సింగరేణి కార్మికులకు 33శాతం వాటా నిరక లాభాల్లో చెల్లించాలని ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలో బీఆర్ఎస్ కోల్‌బెల్ట్ ప్రాంత మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, బాల్క సుమన్, కోవ లక్ష్మి, దివాకర్‌రావు, పుట్ట మధు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ, సెక్రెటరీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, బడికెల సంపత్, వడ్డేపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య, పెట్టెం లక్ష్మణ్, మేడిపల్లి సంపత్, శ్రీనివాసరావు, సమ్మయ్య, వెంకటేష్, ఐ సత్యం, రాజ రమేష్, నడిపెల్లి విజిత్‌రావు, తోట వేణు, జే రవి, ఎం రాజేశం, కార్పొరేటర్లు గాదం విజయ, కృష్ణవేణి, విజయలక్ష్మి, కవిత సరోజ, సంధ్యారెడ్డి పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు